# చేసుకున్నందుకు...



బ్యాంకులో ప్రొబేషనరీ ఆఫీసర్ల నియామకాలు జరుగుతున్నాయి.

రాఘవేంద్రరావు ఎంతో ఉత్సాహంగా ఉన్నాడు.

ఎందుకంటే... అంతకుముందు రాసిన రాత పరీక్ష చాలా బాగా రాసి పాసయ్యాడు. ఆరోజు ఇంటర్వ్యూ ఉంది. అందులో కూడా నెగ్గితే ఆ ఉద్యోగం తప్పక వస్తుందనుకోవచ్చు.

ఆ ఇంటర్వ్యూ కూడా బాగా చేయగలననే నమ్మకం అతనికుంది. ఎందుకంటే... అతనికి మంచి జనరల్ నాలెడ్జి, దానికితోడు– ఎదుటివారిని ఆకర్షించగల మంచి పర్సనాలిటీ

ఉన్నాయి. పైగా... ఇంటర్వ్యూ చేసేవారిలో ఒక మెంబరు అతనికి తెలిసినవాడు. ఈ కారణాలచేత ఆ ఉద్యోగం తప్పక వస్తుందనే ధీమాతో ఉన్నాడు.

ఇంటర్వ్యూ పదకొండు గంటలకి జరుగుతుంది.

భోజనం చేసి నీటుగా తెల్లని బట్టలు వేసుకుని బయలుదేరాడు రాఘవేంద్రరావు. స్టాప్ దగ్గరికి వచ్చీ రాగానే బస్ దొరికింది. అది శుభసూచకంగా భావించి ఉత్సాహంగా కూర్చున్నాడు. కారాకిళ్లీ నములుతూ, రాబోయే ఉద్యోగం గురించి కమ్మని కలలు కంటూ కూర్చున్నాడు.

కారాకిళ్లీ ఉమ్మితో నోరు నిండిపోయింది.

కిటికీలోంచి తల బయటకు పెట్టి తుబుక్కున ఉమ్మేశాడు రాఘవేంద్రరావు. ఎదురుగాలి జోరుగా వస్తోందేమో... ఆ గాలికి ఆ ఉమ్మి ఎగిరి వెనకాల సైకిల్ మీద వస్తున్న ఒక పెద్ద మనిషి షర్టుమీద పడింది.

ఆయన వేసుకున్న తెల్లని బట్టలపై ఎర్రని మరకలు అయ్యాయి.

ఆయన కోపంతో చేయి ఊపుతూ గట్టిగా ఏదో తిట్టాడు.

బస్ ముందుకి సాగిపోయింది. చేసిన పనికి సిగ్గుపడవలసింది పోయి, అదేదో ఘనకార్యం అయినట్లు తనలో తానే నవ్వుకున్నాడు రాఘవేంద్రరావు.

ఇంటర్వ్యూలో రాఘవేంద్రరావు టర్న్ వచ్చింది.

త్రిమూర్తుల్లా ముగ్గురు కూర్చుని ఆ ప్రశ్నలూ, ఈ ప్రశ్నలూ అడగసాగారు. వారిలో ఒకాయన- "మీకు కారాకిళ్లీ అలవాటుందా?" అని అడిగాడు. ఇంటర్వ్యూ చేస్తున్నవారికి ఆయన హెడ్‌లా ఉన్నాడు.

రాఘవేంద్రరావు గతుక్కుమన్నాడు.

"కొంచెంగా అలవాటుందండీ. అప్పుడప్పుడు వేసుకుంటాను" అన్నాడు.

"చూడండీ... మేము ఇంటర్వ్యూ చేస్తోంది ఆఫీసర్ ఉద్యోగానికి! దానికి సరియైన వేషభాషలూ, అప్పియరెన్సు, బిహేవియర్ అవసరం. కారాకిళ్లీ నములుతూ వుండే ఆఫీసర్‌పట్ల కస్టమర్స్‌కి ఎటువంటి అభిప్రాయం ఏర్పడుతుంది? దానివల్ల మన బ్యాంక్ ఇమేజ్ ఎంతగా దెబ్బ తింటుంది? పైగా... మీవంటి మీద చుక్కలు పడడం కూడా గమనించనంతగా మీరు ఉమ్ముతున్నారంటే- మీరు చాలా అజాగ్రత్తపరులని తెలుస్తోంది. ఇటువంటి వ్యక్తి తన క్రింది ఉద్యోగులని కంట్రోల్ చేయలేడు. వారినుంచి రెస్పెక్ట్ కమాండ్ చేయలేడు. ఆఫీసర్ కాగల వ్యక్తికి తగిన హుందా ఉండాలి" అంటూ ముక్కిచీవాట్లు పెట్టాడు- రాఘవేంద్రరావు షర్టు మీద పడ్డ మరకల్ని చూస్తూ.

రాఘవేంద్రరావు తల వంచుకుని, గాలికి తన షర్టు మీద పడ్డ ఆ రసం మరకల్ని చూసి గతుక్కుమన్నాడు.

చివరికి... ఏమీ అనలేక- ''సారీ..!'' అన్నాడు.

ఆ ముగ్గురిలో తనకి తెలిసిన ఆయనవంక దీనంగా చూశాడు. ఆయన ముఖం పక్కకు తిప్పుకున్నాడు. ఇంటర్వ్యూ ఫలితం ఎలా ఉంటుందో అర్థం అయిపోయింది.

ఇంటర్వ్యూ. ఫలితాలు రానే వచ్చాయి. ఊహించినట్లే అన్నీ ఉండికూడా రాఘవేంద్రరావుకి- ఉద్యోగం రాలేదు. తన దురలవాటే ఉద్యోగాన్ని బలి తీసుకుందో, తాను ఉమ్మి వేసిన వ్యక్తి ఉసురే కొట్టిందో అర్థంకాలేదు అతనికి.

చేసుకున్నందుకు అనుభవించక తప్పదు కదా!

*- జాగృతి వార పత్రిక... 20-26 ఆగస్ట్ '90*

## <u>ఆ ప్రసక్తి వచ్చినప్పుడు</u>

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ గోపాలం శిక్షణ పొందుతున్న విద్యార్థుల నుద్దేశించి ప్రసంగిస్తున్నాడు-

"మనం వరి ధాన్యం ఉత్పత్తి పెంచాలి. అందుకు ఏంచేయాలంటే..."



"మరి.., గడ్డి సంగతో..?!" అంటూ మాటకి అడ్డు తగిలాడు తనని గడుసువాడిగా భావించుకునే విజయారావు- ఇతరుల వైపు చూస్తూ.

"ప్రస్తుతం నేను మాట్లాడుతోంది- మనుషులు తినే ఆహారం గురించి! నీ ఆహారం ప్రసక్తి వచ్చినప్పుడు గడ్డి విషయం మాట్లాడుతాను" తాపీగా అని తన పాఠం కొనసాగించాడు డాక్టర్ గోపాలం.

